# ఐలయ్య 'మొత్తం' సమాజం గురించి ఎందుకు రాయాలి?

అధ్యాపకుడు, సామాజిక విశ్లేషకుడు అయిన కంచ ఐలయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పన్నాలాల్ రాసిన హితవచనం చాలా మందికి సహజంగానే కోపం తెప్పించింది. ఐలయ్యగారి అభిప్రాయాలతో ఏకీభవించేవారే కాక విభేదించేవారు కూడా ఒక అధ్యాపకుని అభిప్రాయ స్వేచ్ఛలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ జోక్యాన్ని నిరసించారు. నిరసన తెలుపుతూ సంతకాలు సేకరించి రిజిస్ట్రార్‌కు లేఖలు కూడా రాసారు. ఈ గొడవ చూసి ఆ పెద్దమనిషి మొదట కొంచెం ఆశ్చర్యపోయి ఉంటాడు. అతను ఇంజనీరింగ్ చదువుకున్నాడు. ఆపైన బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ చేసాడు. అధ్యాపకుడిగా చాలాకాలం పని చేసాడు. ఇతరుల అభిప్రాయ స్వేచ్ఛకు ఆటంకం కలిగించే మనిషిగా ఆయన బహుశా తనను తాను భావించుకోడు. ఆయన నిజానికి ఐలయ్యగారిని రాయొద్దనలేదు. కులం సమస్య గురించి విశ్లేషణ చేయొద్దని కూడా అనలేదు. సమాజంలో ఉన్న సమస్యలను భిన్న కోణాలనుండి చూడడం ఎప్పుడూ ఉండేదేననీ, అటువంటి సమస్యలను పరిష్కరించడానికి రకరకాల చర్యలు చేపట్టవచ్చు ననీ, వాటిమీద వ్యాసాలు రాయడం, చర్చలు నిర్వహించడం సభ్య సమాజంలో ఆమోదనీయమైన పనులేననీ కూడా అన్నాడు. ఇవన్నీ ఐలయ్యగారికి రాసిన ఉత్తరంలోనే ఆయన అన్నాడు.

ఇవన్నీ అంటూనే దానికింద 'ప్రాథమికంగా అధ్యాపకులము కాబట్టి' మనం చేసే రచనలు సమాజంలో సామరస్యాన్నీ మానసిక ఏకతనూ పెంపొందించేవిగా ఉండాలని అన్నాడు. విభిన్న ప్రజా సమూహాల మధ్యనున్న అపోహలను పెంచేవి గానూ, విద్వేషాన్ని

రెచ్చగొట్టేవిగానూ ఉండకూడదన్నారు. ఈ హెచ్చరికను దృష్టిలో ఉంచుకుని సమాజాన్ని మొత్తం బాగుచేయడానికి అధ్యాపకునిగా మీ పాత్రను మరింత శక్తివంతంగా నిర్వర్తించమని అన్నాడు.

ఐలయ్యగారివి ఒక కోవకు చెందిన అభిప్రాయాలయినట్టే ఇవి కూడా మరొక కోవకు చెందిన అభిప్రాయాలని రిజిస్ట్రార్ పన్నాలాల్‌గారికి బహుశా తోచి ఉండదు. ఐలయ్యగారివి అభిప్రాయాలనీ, తనది దొడ్డ మనసు నుండి పుట్టిన హితవచనం మాత్రమేనని ఆయన అనుకొని ఉంటాడు, అనుకుంటూ ఉంటాడు. ఆయనే కాదు, చాలామంది అనుకుంటారు బహుశా.

సమాజాన్ని 'మొత్తం'గానే బాగు చేయాలనేది ఎందుకు సత్యం అయింది? సమాజంలో అసమానంగా ఉన్నవారి బాగును కాంక్షించడం, అదే సమాజం బాగుకు దారితీస్తుందని నమ్మడం - పెద్దల చేత హితవచనాలు చెప్పించుకోవలసిన పిల్లచేష్ట ఎందుకయింది? అధ్యాపక వృత్తికి తగని ఆకతాయితనం ఎందుకయింది? అధ్యాపకులు సమాజంలో భిన్నవర్గాల మధ్య మానసిక ఏకతను మాత్రమే ఎందుకు పెంచాలి? మానసిక ఏకత ఎందుకు లేకుండా పోయిందో చెప్పే విశ్లేషణ ఎందుకు చేయకూడదు? అవి సామరస్యాన్ని పెంచేవిగానే ఎందుకుండాలి, సామరస్యం ఎవరు లేకుండ చేసారో చెప్పేవి ఎందుకు కాకూడదు?

ఇక్కడెక్కడో 'అధ్యాపక ధర్మం' అనే భావన ఉన్నట్టుంది. మనుషులకు వారివారి సామాజిక స్థాయిలను బట్టి ధర్మాలు ఉంటాయనీ, ఈ భిన్నధర్మాలను ఆచరించడంలోనే సమాజ శ్రేయస్సు ఉందనీ నమ్మడం హిందువులయి పుట్టిన వారికి సులభంగా అబ్బే ఆలోచనారీతి. ఈ ఆలోచన సత్యాన్ని చంపి పూడ్చిపెట్టే ఆలోచన. డాక్టర్ పన్నాలాల్‌గారు హైందవ ఆలోచనా చట్రానికి వెలుపల ఒక్క క్షణం నిలబడి తన హితవచనాన్ని తానే పరీక్షగా చూస్తే అది ఎంత అన్యాయమైన ఉపదేశమో అర్థం చేసుకోగలుగుతారనుకుంటాను. ఒక విద్యాధికుడు మరొక విద్యాధికునితో 'నువ్వు సత్యాన్వేషణ చేయొద్దు, అది మన ధర్మం కాదు. సమాజంలో సామరస్యాన్ని పెంచడం మన ధర్మం. అందుకోసం కృషిచేయి' అంటున్నాడు. అంతకంటే ఆయన ఐలయ్య గారితో 'నీ అభిప్రాయాలు అసత్యం' అని అంటే అధ్యాపక వృత్తికి ఉచితంగా ఉండేది.

అధ్యాపక వృత్తికే కాదు, మనిషికి 'ధర్మం' అంటూ ఉంటే అది సత్యాన్వేషణే తప్ప వేరే ఏమీ కాదు. ఈ రకంగా ఆలోచించిన బ్రాహ్మణేతర తాత్త్విక సంప్రదాయా లకు కూడా ఈ దేశం నిలయమే. ఐలయ్యగారు తనను తాను ఆ సంప్రదాయానికి వారసునిగా భావిస్తాడు. ఆ వారసత్వాన్ని శతాబ్దాలుగా అత్యంత ప్రమాదకర మైనదిగా

చూసిన హైందవ ఆలోచనారీతి దానికి - హితవచనం పేరు మీదనైతేనేం - అడ్డుకట్ట వేయాలని చూడడంలో ఆశ్చర్యం ఏముంది?

**నీహార్ ఆన్‌లైన్.కామ్**

**జూన్ 2000**

❖

ఈ మధ్య కాలంలో అభ్యుదయవాదుల విశ్లేషణలలో దర్శనమిచ్చే కారణం ఎన్నికలలో నిజంగానే ఫలితం ఇచ్చిన ఏకైక సందర్భం ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో దళిత - బహుజన రాజకీయాలు బిజెపి ఎదుగుదలను ఆపిన వైనం. 'సంఘ్ పరివార్ రాజకీయాలు మన రాజకీయాలు కావు' అన్న సందేశాన్ని దళిత, బహుజన ప్రజానీకంలోకి బలంగా పంపించగలగడం నిజంగానే ఫలితం ఇచ్చింది. వేరే ఏ ప్రయత్నమూ ఆ ఫలితాన్ని ఇచ్చేది కాదు. అదే జరగకపోతే ఉత్తరప్రదేశ్, బీహార్‌లు కూడా సంఘ్ పరివార్ జేబులో ఉన్నట్టయితే, దేశం పరిస్థితి ఈపాటికి ఎంత ఘోరంగా ఉండేదో?

దురదృష్టమేమిటంటే ప్రస్తుత తరంలో దళిత బహుజన రాజకీయాలు అవినీతిమయమయిన రాజకీయ వ్యవస్థలో అంతర్భాగంగా ఎదుగుతున్నాయి. రాజకీయ వాతావరణం మొత్తం కలుషితమయి ఉన్నప్పుడు కొత్తగా ఎదుగుతున్న రాజకీయ శక్తులు దానినే ప్రమాణంగా ఎంచుకోవడం కొంతమేరకు అర్థం చేసుకోగల విషయమే కావచ్చును గానీ అది నిస్సందేహంగా దురదృష్టకరం. 'మావాళ్లు కూడా నీ అంత నిర్లజ్జగా అవినీతికీ ఆశ్రిత పక్షపాతానికీ పాల్పడగలరు చూడండి' అని అగ్రకులాల అవినీతిని సవాలు చేసి సంతోషించే దళిత బహుజన మేధావులు ఉండడం మరీ దురదృష్టకరం.

ఈ కారణంగా ఉత్తరప్రదేశ్ - బీహార్‌లలో మొదలయిన దళిత - బహుజన ప్రతిఘటన అవినీతికీ అధికార దాహానికీ బలయి, అందులో ఒక వర్గం కాకపోతే ఒక వర్గం తన మనుగడ కోసం సంఘ్ పరివార్‌తో చేతులు కలుపుతున్నది. దీనితో తిరిగి పుంజుకునే అవకాశం కాషాయవాదులకు లభించింది.

అదెట్లాగున్నా, సంఘ్ పరివార్ రాజకీయాలను లౌకికవాదం అనే అమూర్తమైన విలువతో ప్రతిఘటించడం కన్నా, మైనారిటీలకు ప్రమాదకరం అనే నినాదంతో ఎదుర్కోవడం కన్నా, హైందవ సమాజంగా గుర్తించబడే సమాజంలోనే మెజారిటీ ప్రజలకది శత్రువని గుర్తించి ప్రతిఘటించినప్పుడే దానిని నిలువరించడం సాధ్యం అన్న ప్రాథమిక రాజకీయ సత్యాన్ని ఉత్తరప్రదేశ్ - బీహార్‌లు నేర్పాయి. అది దేశంలో అన్ని చోట్లా మాయావతి - ములాయం - లాలూ యాదవ్‌ల నమూనాతోనే ఉండవలసిన అవసరం లేదు. అయితే నమూనా ఏదయినా రేపటి రాజకీయాలలో ఈ ఎరుక ఒక ప్రధాన అంశం కావలసి ఉంది.

**(సంఘ్ పరివార్ పైన పోరు)**

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**

**8 డిసెంబర్ 2003**